డా.తంగిరాల మీరా సుబ్రహ్మణ్యం




# అదృష్టం

"ఎందుకమ్మా చీకట్లో నడిచి వచ్చావు? ఫోను చేస్తే నేనొచ్చి కార్లో తీసుకువచ్చేవాడిని కదా" టీవీలో వార్తలు చూస్తూ కూర్చున్న శ్యామకృష్ణ శబ్దం తగ్గించి లేచి గుమ్మందాకా వచ్చి తల్లి చేతిలోని సంచీని అందుకుంటూ అన్నాడు.

"వంద గజాలలో వున్న రవీంద్రగారింటి నుండి నడిచి రాలేనా? ఏం మాతృ ప్రేమలే తండ్రీ నీది!" సోఫాలో కూర్చుంటూ అన్నది సౌదామిని.

అవిడ మాటల్లో కొడుకు తన పట్ల చూపుతున్న అక్కర గురించిన గర్వం ధ్వనించ లేదు గానీ ఎక్కడో అసంతృప్తి తొంగిచూసింది.

"వాళ్ళింట్లో ఇవాళ ఏదైనా విశేషమా? పేరంటానికి పిలిచారా?" అంతసేపు మౌనంగావున్న హరిహరరావు అడిగాడు.

"కొడుకు, కోడలు, మనవడు అమెరికానుండి నిన్ననే వచ్చార్ట. అది పెద్ద విశేషమే కదా! మా మనవడిని చూద్దురుగాని రండీ అంటే వెళ్ళాను. ఇక వెళ్ళినప్పటి నుండీ అమెరికానుండి తమకోసం పిల్లలు ఏమేమి వస్తువులు తెచ్చారో చూపించడానికే గంట పట్టింది రమాదేవికి" శ్యామకృష్ణ అందించిన నీళ్ళుతాగి గ్లాసు పక్కన పెట్టాక చెప్పింది సౌదామిని.

"అంటే అమెరికాలో షాపులు ఖాళీ అయ్యాయన్న మాట! ఇంతకీ ఏమేం తెచ్చారేమిటి?" కొడుకువైపు ఒక చూపువిసిరి అడిగాడు హరిహరరావు. ఆయన కళ్ళలో కనీ కనబడనట్టు అల్లరినవ్వు తొంగి చూసింది.

"రమాదేవికి లాప్‌టాప్, డైమండ్ నెక్లెసు తెచ్చాడట. వాళ్ళ నాన్నకేమో కామ్ కార్డరు, డివిడి ప్లేయరు, డిజిటల్ ఫోటోఫ్రేమ్ ఏవేవో తెచ్చాడు. ఇక్కడ వారం రోజులుండి తర్వాత అత్తగారి ఊరు పూనే వెళ్తారట" వివరాలు చెప్పింది సౌదామిని.

"నీకైనా లాప్‌టాప్ మీద ఇ-మెయిల్ పంపడం వచ్చునుగానీ ఆ రమాదేవిగారికి అసలు కంప్యూటరు గురించి ఓనమాలు తెలియవుగదా" హాల్లో టేబులుమీద కుదురుగా కూర్చున్న లాప్‌టాప్ వైపు ఒకసారి చూసి అన్నాడు శ్యామకృష్ణ.

"అక్కడ విషయం అదిగాదు. వాళ్ళు అమెరికా నుండి అమ్మానాన్నల కోసం వస్తువులు తేవడం అన్నది ముఖ్యం" హరిహరరావు నవ్వును కనబడనీయకుండా నొక్కిపట్టి అన్నాడు.

"అసలు రవీంద్ర వాళ్ళబ్బాయి భాను, మనవాడి గురించి విని ఆశ్చర్యపోయాడు. చెన్నై ఐఐటి నుండి కంప్యూటర్ ఇంజినీరింగు డిగ్రీని గోల్డ్‌మెడల్‌తో సాధించాక శ్యామ్ ఇంకా ఇండియాలో ఏం చేస్తున్నాడు? ఐ.వి. లీగ్ యూనివర్శిటీలలో ఎమ్ఎస్ సీటు పిలిచి మరీ ఇస్తారు. ఇంకా మాస్టర్స్ డిగ్రీ రాకముందే ఉద్యోగం వచ్చి ఒళ్ళో వాలుతుంది. రిసెషన్ వున్నా మెరిట్ వున్న వాళ్ళకు బాధలేదు ఆంటీ..వెంటనే ప్రయత్నం మొదలు పెట్టమనండి" అంటూ ఎంతో ఇదిగా చెప్పాడు" అని చెప్పి నిట్టూర్చింది సౌదామిని.

"అయినా దేనికైనా అదృష్టం వుండాలి" అంది మళ్ళీ తనే.

"అమ్మా! ఆకలేస్తోంది. భోజనం చేద్దాం రా. ఇవాళ వంకాయ కూర చేసావే నాకిష్టమని..తొందరగా చేతులు, కాళ్ళు కడుక్కుని రామ్మా..అమెరికాలోనే కాదు ఇక్కడ కూడా నా మెరిట్‌ని బట్టే పిలిచి మరీ లక్షల జీతంతో ఉద్యోగం ఇచ్చారు కదమ్మా! నువ్వు చేసి పెట్టే ఆకుకూర, పప్పుఅన్నం తింటూ కడుపులోచల్ల కదలకుండా హాయిగా వున్నానని చెప్పాల్సింది వాళ్ళకి" తల్లికీ, తనకీ, తండ్రికీ టేబులు మీద కంచాలు పెట్టి వడ్డిస్తూ అన్నాడు శ్యామకృష్ణ.

"ఇంత బుర్ర ఇచ్చిన దేవుడు నీకు యాంబిషన్ ఇవ్వలేదురా. నా ఖర్మ! ఉన్నవూళ్ళో ఉద్యోగం. అమ్మ వండిన అన్నం పప్పు చాలు అనుకునే వాడిని నిన్నే చూసాను" విన విన నడిచివెళ్ళి చేతులు కడుక్కుని వచ్చి డైనింగు టేబులు ముందు కూర్చుంది సౌదామిని.

సౌదామిని, హరిహరరావులకు ముగ్గురు కూతుళ్ళ తరువాత పుట్టాడు శ్యామకృష్ణ. అమ్మాయిలు ముగ్గురికీ మంచి చదువు, ఉద్యోగం రావడం వలన కష్టపడకుండానే ముగ్గురికీ చక్కని సంబంధాలు కుదిరి పెళ్ళిళ్ళయిపోయి చెరొకచోట సుఖంగా వున్నారు. ఏడాదికో, రెండేళ్ళకో ఒకసారి పుట్టింటికి వచ్చిపోతారు.


ఆఖరివాడు శ్యామకృష్ణ చదువు పూర్తయ్యేసరికి హరిహరరావు రిటైరయ్యారు. అమీరుపేటలో ఎప్పుడో ముప్పై ఏళ్ళ క్రిందట కొన్న స్థలంలో కట్టుకున్న స్వంత ఇంట్లో వుంటున్నారు వాళ్ళు.

శ్యామకృష్ణ బిటెక్‌లో చేరినప్పటినుండీ అమెరికా కలలుకనడం మొదలుపెట్టింది సౌదామిని. అతను మూడో సంవత్సరం చదువుతుండగానే ఇరుగుపొరుగు వారితో కొడుకు అమెరికా ప్రయాణం గురించి చెప్పడం మొదలుపెట్టింది.

"ఇంకెంత ఒక సంవత్సరం మా దగ్గర వుంటాడేమో..తరువాత 'ఎమ్ఎస్' చేయాలంటూ ఎగిరి వెళ్ళిపోతాడు. చదువైపోగానే తిరిగి వచ్చేస్తాడా? అక్కడే మంచి ఉద్యోగం దొరకగానే 'ఇండియాలో ఏం వుందమ్మా? దుమ్ము, మురికి కాలువలు, కాలుష్యం, కరప్షన్ తప్ప..ఇంత జీతం, ఈ శుభ్రత, ఇక్కడ దొరికే క్వాలిటీ ఆఫ్ లైఫ్ అక్కడ చస్తే దొరకదు' అంటూ అక్కడే స్థిరపడిపోతాడు. వాడిని చూడకుండా వుండలేము గనుక మేమూ, ఇండియాకు అమెరికాకు నడుమ తిరుగుతూ వుండాలి" అంటూ.

కానీ ఆవిడ ఆశల్ని వమ్ము చేస్తూ శ్యామకృష్ణ హైదరాబాదులోనే పేరుపొందిన కంపెనీలో మంచి జీతంతో ఉద్యోగంలో చేరిపోయాడు.

ఒకప్పుడు పెద్ద పెద్ద నగరాల్లో ప్రతి వీధినుండి ఒక కుటుంబ సభ్యుడు అమెరికాకి వెళ్ళడం వుండేది. ఇప్పుడిప్పుడు చిన్న ఊళ్ళ నుండి కూడా ఒక్కో ఇంటినుండి కనీసం ఒకరైనా అమెరికా ప్రయాణం కావడం జరుగుతోంది. ఇదివరకు అబ్బాయిలు చదువుకోసమో, ఉద్యోగం కోసమో వెళ్తే, ఆడపిల్లలు అమెరికా సంబంధాలు చేసుకుని మొగుడి వెంట వెళ్ళడం జరిగేది. ఇప్పుడు అమ్మాయిలూ చదువుకోసం, ఉద్యోగరీత్యా



విదేశాలకు ఎగిరిపోవడం సామాన్యమైపోయింది.

సౌదామిని, హరిహర రావు దంపతులకు పరిచయ స్తులు, స్నేహితులు అందరి పిల్లలూ చదువు పూర్తికాగానే రెక్కలు కట్టుకుని ఎగిరి వెళ్ళి పోయారు. వాళ్ళంతా పిల్లలు రమ్మన్నారంటూ, కోడలి కాన్పుకో, కూతురి పురిటికో అమెరికా వెళ్ళి వచ్చి అక్కడ చూసివచ్చిన విశేషాలతో కూడిన కబుర్లుచెప్తూ, ఫోటోలు చూపిస్తూ వుంటే శ్యామకృష్ణ ఎప్పుడెప్పుడు బయల్దేరుతాడా అని ఎదురుచూసిన సౌదామి నికి కొడుకు "ఉన్న ఊళ్ళో ఇంతమంచి ఉద్యోగాన్నీ, కన్నవాళ్ళనీ వదలి నేనెక్కడికీ పోనమ్మా" అని చెప్పేయడంతో గొప్ప నిరాశ కలిగింది. ఆ అసంతృప్తి అప్పుడప్పుడూ మాటల్లో బయటపడుతూనే వుంటుంది.

"మీ స్నేహితుడు వనమాలిగారి అబ్బాయి యుఎస్‌కు వెళ్ళిన నాలుగైదేళ్ళలో మూడుకోట్లు పెట్టి స్వంత ఇల్లు కొనుక్కున్నాడని చెప్పలేదూ ఆయన? ఆ అబ్బాయివుండేదెక్కడా సన్నీవాలీనా శాన్‌హోసేనో కదండీ!" హరిహరరావును కదిపింది సౌదామిని.

"ఎంతైనా వాళ్ళ అదృష్టమే అదృష్టం" అంది మళ్ళీ తనే.

"ఇప్పుడు మనం వుంటున్న ఈ ఇల్లు కూడా సుమారు రెండుకోట్లు వుంటుంది మార్కెట్ రేటు ప్రకారం. అమ్ముతామంటే కొనేవాళ్ళే వుండరు గానీ" నవ్వుతూ అన్నాడు హరిహరరావు.

"వాళ్ళు మూడు కోట్లు పెట్టికొనే ఇంట్లో ఒకటో రెండో గోడలు, నాలుగు కిటికీలు మాత్రం వాళ్ళ సొంతం అమ్మా..మిగతాదంతా బ్యాంకు పెట్టిన డబ్బు. ఇరవై ఏళ్ళకో, ముప్పై ఏళ్ళకో తీర్చుకుంటారు. అలా తీర్చని వాళ్ళ మూలానే అక్కడ రియల్ ఎస్టేట్ బుడగ పగిలిపోయి, బ్యాంకులు ఇల్లు వేలం వేయాల్సి వస్తోంది. ఎకానమీ ఘోరంగా దెబ్బతింది" శ్యామకృష్ణ అన్నాడు.

వెంటనే మళ్ళీ "ఇవాళ వంకాయకూర చాలా బాగా కుదిరిందమ్మా!" అంటూ గిన్నెలో మిగిలిన కూర వడ్డించుకున్నాడు.

సౌదామినికి ఒళ్ళుమండింది.

"ఇంకేం తోటకూర పప్పు, మునక్కాయల పులుసు, వంకాయకూర వండడం వచ్చిన పిల్లని కట్టుకో సరిపోతుంది" అంది విసుగ్గా.

★ ★ ★

మర్నాడు ఉదయం శ్యామకృష్ణ ఆఫీసుకు వెళ్ళిపోయాక పూజ చేసుకుంటూ కూర్చున్న సౌదామిని కాలింగ్ బెల్ మోగడంతో విసుక్కుంటూ వచ్చి తలుపు తీసింది. హరిహరరావు స్నానాల గదిలో వున్నాడు.

వచ్చింది భరత్. హరిహరరావుకు వరుసకు పెద్ద నాన్న అయిన నరహరిగారి కొడుకు. వాళ్ళు సికింద్రాబాద్‌లో కార్తికేయ నగర్‌లో వుంటారు. భరత్ గత ఇరవై సంవత్సరాలుగా అమెరికాలో స్థిరపడిపోయాడు. నరహరిగారికి ఎనభై పదులు దాటడంతో ఇక ప్రయాణం చేయలేకపోతుండడం వలన అతనే వచ్చి చూసి వెళ్తుంటాడు. మొదట్లో అతని భార్య, పిల్లలు కూడా వచ్చేవారు. తరువాత అతను మాత్రం వచ్చి వెళ్తున్నాడు. ఈమధ్యన ఆర్నెల్లుగా ఆయనకు ఒంట్లో బాగు లేకపోవడం వలన భరత్, భార్యతో కలిసి వచ్చి ఇక్కడే వుంటున్నాడు. తండ్రిని ఆఖరిదశలో ఒంటరిగా వదలిపోలేక ప్రత్యేక అనుమతితో ఇండియాలో వుంటున్నాడు. అమెరికాకు వెళ్ళిన పదేళ్ళకే అతడికి అక్కడి సిటిజన్ షిప్ వచ్చేసింది.

"నాన్నగారెలా వున్నారు? ఒక్కడివే వచ్చావేం భరత్, సుమను తీసుకు రావాల్సింది" అంటూ ఆదరంగా ఆహ్వానించింది సౌదామిని.

ఇంతలో హరిహరరావు స్నానం ముగించి వచ్చాడు.

"పెదనాన్న ఆరోగ్యం ఎలా వుంది? మీకింకా లీవు వుందా?" అంటూ భరత్ పక్కన కూర్చున్నాడాయన. సౌదామిని లోపలికి వెళ్ళింది. కాఫీ, ఫలహారం తేవడానికి.

ఆవిడ లోపలికి వెళ్ళగానే "ఇలా అంటున్నానని ఏమనుకోకు చిన్నన్నా! ఈయన పరిస్థితి బాగా లేదని, చివరి రోజుల్లో ఆయన దగ్గరుండాలని 'సిటిజన్ ఆఫ్ ఇండియన్ ఆరిజన్' గా ప్రత్యేక అనుమతితో వచ్చి వుంటున్నామా? ఎన్నాళ్ళని ఇలా? అక్కడ నా కొడుకు ఉద్యోగంలో చేరుతున్నాడు. కూతురు గ్రాడ్యుయేషన్ పూర్తిచేసింది. వాళ్ళను కూడా పట్టించుకోవాలి కదా మేము. ఈయనకు చూస్తే అటూ ఇటూ కాకుండా వుంది. ఏం చేయాలో తెలీక టెన్షన్ పడుతున్నాం" అన్నాడు విసుగ్గా.

హరిహరరావుకు ఏం మాట్లాడాలో తోచలేదు. వంటింట్లో వున్న సౌదామినికి ఈ మాటలు స్పష్టంగానే వినిపించాయి.

'అంటే కొడుకు దయతో కొన్నాళ్ళు లేక ఆర్నెల్లో ఏడాదో అతి కష్టం మీద వచ్చి ఇక్కడ వున్నప్పుడు ఆ ముసలాయన తొందరగా 'హరీ' అనలేదని ఇతని ఆక్రోశమా?' అనే భావం భార్యాభర్తల మనసుల్లో ఒకేసారి మెదిలింది.

"అమ్మ హఠాత్తుగా గుండె ఆగి చనిపోవడంతో ఎవ్వరినీ ఇబ్బంది పెట్టకుండా వెళ్ళిపోయింది. నాన్నకు వంటమనిషిని, పనిమనిషిని పెట్టి ఇన్నేళ్ళుగా ఎలాగో జరిపాము. ఇంకో మూడు నాలుగు నెలలకన్నా ఇక్కడ వుండడం సాధ్యం కాదు మాకు. ఆ లోపుగా గనుక ఈయన.." అంటూ సౌదామిని కాఫీ తీసుకురావడంతో ఆగిపోయాడతను.

కాఫీ అందించి ఇక అక్కడ కూర్చోలేనట్టు లోపలికి వచ్చేసింది సౌదామిని. 'రెండు, మూడు నెలల్లో నరహరి గారు గనుక కన్ను మూయకపోతే వీళ్ళని చాలా ఇబ్బంది పెట్టినట్టేనన్నమాట. భరత్ వాళ్ళమ్మ గుండె ఆగి చనిపోవడం ఆవిడ అదృష్టమో లేక కొడుకు కోడలు అదృష్టమో' అనుకుంటూ నిట్టూర్చింది సౌదామిని.

భరత్ వెళ్ళిపోగానే ఏదో ఫోను రావడంతో కంగారుగా బయల్దేరి వెళ్ళిపోయాడు హరిహరరావు. ఆ వెళ్ళడం మళ్ళీ రాత్రి ఎనిమిదింటికి ఇల్లు చేరాడు. మధ్యాహ్నం భోజనానికి ఆలస్యమయిందని సౌదామిని ఫోను చేస్తే "నువ్వు తినేసెయ్. నేను రావడం ఆలస్యం కావొచ్చు" అని ఫోను కట్ చేసాడు.

వాడిపోయిన ముఖంతో నీరసంగా ఇల్లుచేరిన భర్తను చూసి కంగారుపడింది సౌదామిని. మంచినీళ్ళు అందించి "ఏమయిందండీ?" అనడిగింది అనునయంగా.

"వనమాలికి యాక్సిడెంటయ్యింది. అతను కూర్చున్న ఆటోను వెనకనుండి సుమో గుద్దిందట. ఆటోనుండి ఎగిరి పేవ్‌మెంటుమీద పడ్డాడు. ఆ పడడం కూడా ఎలక్ట్రిక్ స్తంభం తిన్నెను తాకింది తల. పరిస్థితి విషమంగా వుంది. కాళ్ళు చేతులకు కూడా ఫ్రాక్చర్ అయింది" విషాదంగా చెప్పాడాయన.


నోటమాటరానట్టు నిలబడిపోయింది సౌదామిని.

"మొన్ననే అనుకున్నారు వాళ్ళు ఎంతో అదృష్టవంతులని? వాళ్ళ కొడుకుకు ఫోను చేశారా? వాళ్ళు బయల్దేరారా?" నెమ్మదిగా అడిగింది.

"ఏ విషయం తెలిసాక వస్తామన్నాడట. ఇప్పుడు ఆయనున్న పరిస్థితిలో తను వచ్చి చేసేదేమీ లేదు గనుక వెంటనే వచ్చి వెళ్ళడం వీలవ్వదని కాస్త నిదానించి వస్తానన్నాడట. డాక్టరుతో మాట్లాడి అనవసరంగా మెషీన్ల మీద పెట్టి ఆయన జీవితం పొడిగించే ప్రయత్నం చేయవద్దని చెప్పాడుట. తల్లికి ఈ విషయం తెలీదు. నాకు డాక్టరు చెప్పాడు" నిర్వేదంగా చెప్పాడు హరిహరరావు.

సౌదామిని నిలబడలేనట్టు సోఫాలో కూలబడింది.

"ఒకవేళ ఆయనకు బ్రతకాలని వున్నా మంచాన పడి వుండడం కొడుకుకు ఇష్టం లేదు గనుక ఇవ్వగలిగిన ట్రీట్‌మెంటు కూడా ఇవ్వొద్దన్నాడన్నమాట. ఏం పిల్లలు? వీళ్ళకోసం జీవితంలో పాతికేళ్ళు ధారపోసి ప్రాణంగా పెంచుతాం. నిజంగా అటువంటి పిల్లలుం



## షారుఖ్ స్పెషల్ బైక్

***షారుఖ్ నిర్మిస్తూ నటిస్తున్న సైన్స్ ఫిక్షన్ 'రా.వన్' నిర్మాణంలో ఇప్పటికే ఎంతో జాప్యం అవుతుంటే తాజాగా ఓ బైక్ పుణ్యమాని కొన్ని వారాలపాటు షూటింగ్ ఆగిందిట. 'డుకాటీ' అనే ఓ స్పెషల్ బైక్‌తో ఈ సినిమా కోసం లండన్‌లో కొన్ని తీసుకున్నారట. ఇండియా వచ్చేసిన తర్వాత చూసుకుంటే మరికొన్ని బిట్లు తీసేందుకు అదే బైక్ అవసరం కలిగిందిట. వెంటనే లండన్‌కి కబురుపెట్టి ఆ బైక్ తెప్పించే ప్రయత్నాలు మొదలెట్టాడు షారుఖ్. బైక్‌గారు ఇప్పుడు ముంబయ్ చేరుకున్నారట. ఇక షూటింగ్ మొదలెట్టడమే తరువాయి. యాక్టర్ల కాల్షీట్ల కంటే ఇలాంటి బైక్‌ల కాల్షీట్లే చాలా కష్టం సుమండీ అంటున్నారు ఆ సినిమా యూనిట్ వాళ్ళు.***

డడం తల్లిదండ్రుల దురదృష్టం. ఒక్కడే కొడుకు కదా! కర్మ జరిపించడానికి రాక తప్పదని ఆ కబురేదో తెలిసాక బయల్దేరుదామని అనుకున్నాడులా వుంది"' సౌదామని గొంతు వణికింది.

శ్యామకృష్ణ ఇంటికి వచ్చే సమయానికి భార్యాభర్తలిద్దరూ కాస్త గుండె దిటవు చేసుకుని మామూలుగా వుండడానికి ప్రయత్నించారు.

"అమ్మా! నన్ను ఒక సంవత్సరం అమెరికాలో పని చేయడానికి పంపిస్తార్ట మా కంపెనీ వాళ్ళు" భోజనాల దగ్గర మౌనంగా వున్న తల్లిదండ్రులను సంభాషణలోకి దింపుతూ అన్నాడు శ్యామకృష్ణ.

ఉలిక్కిపడింది సౌదామిని. "సంవత్సరం అని పంపి మళ్ళీ పొడిగించరుగా" భయంగా అడిగింది.

"ఎప్పుడు వెళ్ళాలిరా?" అనడిగాడు హరిహరరావు.

"మూడు నాలుగు నెలలకన్నా ఎక్కువ వుండాల్సి వస్తే నేను వెళ్ళనని చెప్పేసాను నాన్నా. ఇక వాళ్ళిష్టం" అన్నాడు శ్యామకృష్ణ. సౌదామిని ముఖంలోకి కళ వచ్చింది. "మంచి పని చేసావు" అంది వెంటనే. తల్లి వైపు ఆశ్చర్యంగా చూసాడు శ్యామకృష్ణ.

మర్నాడు శనివారం. సెలవురోజు. ఎనిమిదింటికి నిద్రలేచిన శ్యామకృష్ణ హడావుడిగా తయారవుతూ "అమ్మా ఇవాళ మా కొలీగ్‌ని మనింటికి బ్రేక్‌ఫాస్ట్‌కి పిలిచాను. టిఫినేం చేస్తున్నావు?" అనడిగాడు.

"పెసరట్టుకు నానబోసానురా. ఉప్మా కూడా చేయమంటావా?" అనడిగింది సౌదామిని.

"అంతకంటే నేనేమీ అడగను మాతా" నాటకీయంగా అనేసి స్నానానికని బాత్‌రూములో దూరాడు.

సౌదామిని ఉప్మా చేసి పెట్టి, పెసరట్లు వేయడానికి సిద్ధమవుతుండగానే కాలింగ్ బెల్ మోగింది.

హరిహరరావు పెరట్లో వుండడంతో 'శ్యామకృష్ణ స్నేహితుడే అయివుంటాడు' అనుకుంటూ చేతులు కదుక్కుని, వెళ్ళి తలుపుతీసింది సౌదామిని.

అక్కడ అందమైన అమ్మాయి నిలబడి వుండడంతో అర్థంకానట్టు చూసిందావిడ.

"నేను శ్యామ్ కొలీగ్‌నండీ. నా పేరు దివ్య" అన్నదా అమ్మాయి. ఆమె చూపులు శ్యామ్‌కోసం వెదుకుతున్నాయి.

తడబాటును కనబడనీయకుండా సర్దుకుంటూ "అవునమ్మా శ్యామకృష్ణ చెప్పాడు ఇలా వచ్చి కూర్చోమ్మా. మంచినీళ్ళు కావాలా?" అంటూ కుశల ప్రశ్నలు వేసింది.

'శ్యామ్' అన్న ఆ పిల్ల పిలుపులోని సాన్నిహిత్యం ఆవిడ దృష్టిని దాటిపోలేదు.

"హాయ్ దివ్యా!" అంటూ వచ్చి ఆ అమ్మాయి పక్కనే కూర్చున్నాడు శ్యామకృష్ణ.

వాళ్ళకు కాఫీ, ఫలహారాలు ఏర్పాటు చేయడానికి లోపలికి వెళ్ళింది సౌదామిని.

కాసేపట్లో దివ్య కూడా వంటింట్లోకి వచ్చింది "ఆంటీ నేను సహాయం చేయనా?" అంటూ.

"దివ్యకు వాళ్ళ నాన్న పెళ్ళి చేసెయ్యాలని చూస్తున్నార్ట. అందుకని వంటలన్నీ నేర్చుకుంటున్నది" వుడికిస్తున్నట్టు అన్నాడు శ్యామకృష్ణ అందరూ టేబులు దగ్గర కూర్చుని తింటున్నప్పుడు.

"అంటే వండి పెట్టడానికే పెళ్ళి చేసుకుంటారా మగవాళ్ళు?" వుడుక్కుంటూ అంది దివ్య.

"ఇంతకీ సంబంధాలు చూస్తున్నారా? అమెరికాలో వుండే వాడా ఆస్ట్రేలియాలో ఉద్యోగస్థుడా ఎవరు కావాలి మీ వాళ్ళకి?" నవ్వుతూ అడిగింది సౌదామిని.

"మా అమ్మా నాన్నలకు నేను ఒక్కత్తినే సంతానం ఆంటీ! వాళ్ళను వదిలి ఎక్కడికీ వెళ్ళను" అంది దివ్య, శ్యామ్‌వైపు చూస్తూ.

"అచ్చం నాలాగే అమ్మా! పోనీ నన్ను చేసుకుంటుందేమో అడుగు" సరదాగా అంటున్నట్టు అమ్మతో అన్నాడు శ్యామకృష్ణ.

హరిహరరావు చిరునవ్వుతో సౌదామిని వైపు చూసాడు. సౌదామిని శ్యామకృష్ణ కళ్ళలో మెరుపును చూస్తోంది. దివ్య ముఖంలో సిగ్గునూ గమనించింది.

"అమ్మానాన్నలను వదలి దూరంగా వెళ్ళము అనే పిల్లలు ఈ కాలంలో ఎవరున్నారు? ఎంతసేపూ తమ కెరీర్, సంపాదన, తమ పిల్లలకు తామెంత గొప్ప జీవితాన్ని ఇవ్వగలమోననే ఆలోచనే తప్ప తమను కన్నవాళ్ళను కడదాకా చూసే బాధ్యత మాది అనుకునే మంచి మనసు ఎందరికుంది?

డబ్బులిస్తాం. నర్సును, పనివాళ్ళను పెడతాం. ఆఖరిరోజుల్లో కావాలంటే సెలవుపెట్టి వచ్చి నెలో రెండునెలలో వుంటాము. ఆ లోపుగా బుద్ధిగా ఆఖరిశ్వాస తీసుకోండి అనే వాళ్ళే అందరూ. అందుకే దేశమంతా వృద్ధాశ్రమంగా మారిపోతోందేమో! మా కోసం మీరు, మీ కోసం మేము అనగలిగే మీవంటి పిల్లలుండడం మా అదృష్టం. మా శ్యామకృష్ణను చేసుకుని మీ అమ్మానాన్నలకు, అత్తామామలకు కంటి వెలుగుగా వుండిపోమ్మా" ఆర్ద్రంగా అంది సౌదామిని. ఆమె గొంతులో పలికిన ఆర్తి హరిహరరావు మనసును తాకింది.

శ్యామ్, దివ్య చిరునవ్వుతో ఒకరినొకరు చూసుకున్నారు. పక్కన కూర్చున్న అమ్మ భుజం చుట్టూ చేయివేసాడు శ్యామ్.

" ఇంతకీ దివ్యా! నీకు వంకాయ కూర, మునగకాయల పులుసు, ఆకుకూర పప్పు కమ్మగా చేయడం వచ్చా" నవ్వుతూ అడిగింది సౌదామిని.

"అచ్చం నీలాగే చేస్తుందమ్మా" అనేసి పట్టుబడ్డ దొంగలా కళ్ళు మూసుకున్నాడు శ్యామకృష్ణ.

దివ్య సిగ్గుగా చూస్తుంటే సౌదామిని, హరిహరరావు హాయిగా నవ్వారు.

# వర్మ స్పెషాలిటీ!

*కొాస్త పేరున్న హీరోగానీ, దర్శకుడుగానీ ఆ సినిమాకి వుంటే సినిమా బడ్జెట్ కోట్లలోనే వుంటోందీమధ్య. పాతిక కోట్లు పెట్టడం అనేది చాలా సాధారణమైపోతున్న ఈ రోజుల్లో 12 కోట్లతో ఐదు సినిమాలు తీయడం అంటే చాలా గొప్ప విశేషమే కదా! రామ్‌గోపాల్ వర్మ తాజా సంచలనం 'రక్తచరిత్ర'కి 12 కోట్లు ఖర్చయిందిట. తెలుగు, హిందీ భాషల్లో ఈ సినిమా రెండేసి భాగాలుగా రూపొందితే, తమిళంలో ఒక భాగం నిర్మాణం అయింది. అన్ని వెర్షన్లూ ఒకేసారి నిర్మాణమయ్యాయి కాబట్టి కొంత డబ్బింగ్ వర్క్ కూడా కలిసొస్తుంది. ఏదేమైనా 12 కోట్లతో వర్మ లాంటి పేరున్న డైరెక్టర్ నుంచి 5 సినిమాలంటే నిర్మాతకి మంచి లాభాలు వచ్చితీరతాయి కదా!*

